# విధి వంచితుడు

తలుపు తీసుకుని ఇంట్లోకి ప్రవేశించేసరికి గోడమీద గడియారం మ్యూజిక్ యిచ్చి - పదకొండుసార్లు కూసింది.

పదకొండు!

తలుపు వేసేసి బట్టలు కూడా మార్చుకునే ఓపిక లేక డబుల్‌కాట్ మీద వాలిపోయాడు సారథి.

జీవితంలో ఏముందని బ్రతకాలి?

"సత్రం భోజనం మఠం నిద్ర" తనలాంటి వాళ్లను చూసి అనుంటారు. గోడకు సత్య ఫొటో వేలాడుతున్నది. ఆ ఫొటోకు వాడిపోయిన పూలదండ. గాలి కొట్టినప్పుడల్లా ఫొటో మీది దండ ఊగుతోంది?

అతని జీవితం నుండి సత్య నిష్క్రమించి సంవత్సరంపైన నాలుగు నెలలు దాటిపోయాయి.

ఒక సంవత్సరం అన్యోన్యంగా కాపురం చేశారు.

స్వర్గానికి రమ్మనమని పిలుపు వచ్చినా పోలేని ఆనందంలో మునిగిపోయాడు సారథి.

కానీ దేవుడికి కన్నుకుట్టింది.

మొదటి శాడిస్ట్ గాడ్‌యేగా!

సత్యను పైకి తీసుకుపోయాడు.

భయంకరంగా కాలిపోయి నోరు తెరచి ఏమీ చెప్పలేని స్థితిలో చచ్చిపోయింది.

మొదటి నుంచి సత్యకు నిర్లక్ష్యం జాస్తి! నిప్పుతో చెలగాటం చేస్తూ ఉంటుంది. ఓ దుర్ముహూర్తాన నైలాన్ శారీ కట్టుకుని వంట చేస్తూ ఉంటే చీర అంటుకుంది అజాగ్రత్తవలన. ఆమె కేకలు విని వంటింట్లోకొచ్చేసరికే సత్య పూర్తిగా మంటల్లో చిక్కుకుపోయింది.

ఆ దృశ్యానికి షాక్ తిని కళ్లు తిరిగి పడిపోయాడు.

ఇరుగు పొరుగు వచ్చి హాస్పిటల్‌లో చేర్పించారు. సంఘంలో గర్వంగా తిరిగే సారథి స్టేటస్ ఆ రోజు నుండే మారిపోయింది.

ఎక్కువ మంది సత్య మరణాన్ని యాదృచ్ఛికంగా కాకుండా సారథి పన్నిన కుట్రగా చెప్పుకున్నారు.

దానికితోడు సత్య తల్లిదండ్రులు కూడా అనుమానంతో సారథిని కోర్టుకీడ్చారు.

ఆ కేసులోంచి బయటపడేసరికి చావుతప్పి కన్ను లొట్టపోయింది.

సత్య జ్ఞాపకాలు అతన్ని కలత నిద్రలో ముంచాయి.

ఆమెతో గడిపిన మధుర క్షణాలు మరల మరల గుర్తుకొస్తాయి. కాని ఆమె పోయినతర్వాత లోకం మోపిన నిందలు, పడ్డ బాధలు వెంటనే స్మృతి పథంలో నిలిచి మనసును కలచివేస్తాయి.

ఆ రెండూ అతన్ని ఉయ్యాల జంపాల ఆడిస్తున్నాయి.

సత్య లేని జీవితంలో పస లేదు.

జీవించే లోకంలో నస ఉంది.

తెల్లవారుజామున దబదబ తలుపులు చప్పుడైతే లేచాడు. టైం నాలుగయింది. తను నిద్రపోయి గంటయిందో.. రెండు గంటలయిందో, యిదిగో యిదో గొడవ.

తలుపుతీశాడు. ఎదురుగా పల్లవి!

ఆశ్చర్యం వేసింది పగటిపూట కూడా తన యింటికి రావడానికి భయపడే పల్లవి తెల్లవారుజామున!

"సారథిగారు! నాన్నగారికి బాగులేదు. మీరు ఆటో తెస్తే హాస్పిటల్‌కు తీసుకెళ్లాలి" ఆమె గుండె చాలా వేగంగా కొట్టుకుంటున్నట్లుంది.

"ఈ సమయంలో ఏ ఆటో దొరుకుతుంది"? అయినా ఏం జరిగింది?"

"నాన్నకు గుండెనొప్పి వచ్చింది. వెంటనే ఆసుపత్రిలో చేర్చాలి.. లేకపోతే నాకు దక్కరు" ఏడ్చింది ఆదుర్దాగా.

సారథి యింకేం ఆలోచించలేదు - తలుపు తాళం వేసి ఆటో కోసం పరుగెత్తాడు.

రెండు ఫర్లాంగులు చీకట్లో చాతనైనంత స్పీడుగా పరుగెత్తి ఆటో పట్టుకున్నాడు.

ఆఘమేఘాలమీద ఇంటికి తీసుకొచ్చాడు. ఆటోవాలా తను కల్సి చేతులమీదుగా మోసుతొచ్చి ఆటోలో వెనక సీట్లో కూర్చోపెట్టారు ఆంజనేయుల్ని. చెరోపక్క తను, పల్లవి కూర్చున్నారు.

అదృష్టం కొద్దీ ఎమర్జెన్సీలో డాక్టరు, నర్సు మేలుకునే ఉన్నారు. కేసు వివరించగానే వెంటనే అటెండ్ అయ్యారు.

తెల్లారిన తర్వాత స్పెషలిస్టులు వచ్చి పరిశీలించారు. తమ వార్డులోకి ఆంజనేయుల్ని మార్పించారు.

మధ్యాహ్నంకు ఆంజనేయులు కొంచెం కోలుకున్నాడు. అప్పటిదాకా సారథి పిచ్చివాడిలా అడిగిన మందులన్నీ తెచ్చాడు.

ఆఫీసుకు కూడా పోకుండా యింటికి హాస్పిటల్‌కు చెడతిరిగాడు. కొంత డబ్బు కూడా అడ్జస్ట్ చేశాడు. కొంత మందులషాపులో అప్పు యిప్పించాడు. బాగా అలసిపోయాడు.

సాయంత్రం ఇంక భయం లేదన్నారు డాక్టర్లు.

"చాలా థాంక్సండీ! మీ రుణం ఎలా తీర్చుకోవాలో!" పల్లవి అతనికి కృతజ్ఞతలు తెలిపింది.

వేదాంతిలాగా నవ్వాడు సారథి.

"నా సత్యను దక్కించుకోలేకపోయాను. కనీసం నా వల్ల మీకు మీ నాన్న దక్కితే నా జీవితానికి అంతకంటే ప్రయోజనం ఏముంటుంది కనుక?"

అప్పుడొచ్చింది పల్లవి తల్లి టెలిగ్రాం అందుకుని కొడుకు దగ్గరనుండి. అనసూయమ్మ అనుమానం మనిషి!

"బాబూ! సమయానికి వచ్చి సాయం చేశావు. చాలా సంతోషం. ఇంక నేను, అబ్బాయి వచ్చాంగా.. నువ్వు పోయి విశ్రాంతి తీసుకోబాబు". అనసూయమ్మ అంది అతన్ని కొరకొరా చూస్తూ. అతను చేసిన తప్పల్లా పల్లవి పక్కన నిలబడ్డం.

"మంచిది. ఉంటా పల్లవి". అంటూ సెలవు తీసుకున్నాడు. పల్లవి చిన్నపిల్ల! తను భార్యను పోగొట్టుకున్నవాడు. తన గురించి చెడుగా ఎందుకాలోచించాలి? ఈ లోకంలో పరాయి స్త్రీ, పురుషుల మధ్య నీచ సంబంధం తప్ప ఇంకో మంచి సంబంధం వుండకూడదా?

ఇంటికి పోబుద్ధికాక సీతాపతి యింటికి వెళ్లాడు. సీతాపతి అతని ఫ్రెండు. అదేం ఖర్మో.. అతని భార్య పేరు సీత! పెళ్లయి నాలుగేళ్లయినా పిల్లలు లేరు. అందుకని ఏ రోజు

చూసినా కొత్త జంటలా కువకువలాడిపోతూ ఉంటారు.

"ఏందోయ్! నీ మొహం చూస్తే పది లంఖణాలు చేసినవాడిలాగుంది?" సీతాపతి పరామర్శ.

"నిద్ర లేదు సరిగా."

"రండి సారథిగారూ! మా వారికి కంపెనీ లేక ఒకటే బోర్‌గా ఫీలవుతున్నారు" సీత అంది.

"అదేంటి మీరుండాగానే... చెవిలో యిల్లు కట్టుకుని కబుర్లు చెబుతూనే ఉంటారుగా!" ఆశ్చర్యంగా అన్నాడు.

"అబ్బా! అదంతా పెళ్లయిన కొత్తల్లో! అప్పుడు నేనేం చెప్పినా నోరు తెరుచుకుని వినేవారు. ఇప్పుడే, నేనేం మాట్లాడినా ఆయనకు బోర్!" చెప్పింది సీత.

"చెప్పినవే ఇప్పటికి ఓ వందసార్లు చెప్పి ఉంటుంది. అయినా నేను వినాలిట."

"ఎన్నిసార్లు చెప్పినా మీ బుర్రకెక్కదుగా?"

అనతికాలంలోనే వాళ్లు కీచులాడుకోవడం మొదలెట్టారు. వారి ముందు సారథి ఉన్నాడన్న విషయం మర్చిపోయారు. ఒకళ్లని ఒకళ్లు మొట్టికాయలేసుకోవడం వగైరాలు చేసుకున్నారు.

"నేను వెళతాను సీతాపతి క్యారీ ఆన్!" తను వాళ్ల మధ్య పానకంలో పుడకలా ఎందుకని లేచాడు.

"వాటీజ్ దిస్! భోంచేసి వెళుదువుగాని కూర్చో!" సీతాపతి బలవంతంగా కూర్చోపెట్టాడు.

"కూర్చోండి! ఆ మాటనే చెబుదామంటే ఆయనే చెప్పారు. అయినా ఫర్వాలేదు. మీకూ వండుతాను కూడు."

"హోటల్లో తింటా?"

"ఇలా అడ్డమైన గడ్డి తినకపోతే పెళ్లి చేసుకోరాదురా?"

"అవును సారథిగారు! మీరు పెళ్లెందుకు చేసుకోకూడదు?"

"సత్యతో ఓ సంవత్సరం గడిపిన వాడెవడూ అలా ఆలోచించలేడు. నిన్నో మొన్నో పోయినట్లు నా కళ్లెదుట ఉంది". చెప్పాడు.

"ఊరుకోరా! ఇంకొకతెని కట్టుకుంటే ఆమెను క్షణాల్లో నువ్వు మర్చిపోయేట్టు చేస్తుంది" సీతాపతి అన్నాడు.

"అవును. ఆడదిక్కు లేకుండా ఎంతకాలం ఉండగలరు. పెళ్లి చేసుకోండి. గంతకు తగ్గ బొంత!" ఆమె చెప్పింది.

"నేను గంతనైతే నాకు బొంత దొరకాలికదా..." సారథి అన్నాడు.

"మీరు ఊ... అంటే మా బంధువులమ్మాయి ఉంది. బాగానే ఉంటుంది కాని..." ఆమె ఆగింది సందేహంగా...

"ఆమెకు ఓ కాలు లేదు. చెయ్యి కొంచెం అవుడు... అయినా బాగుంటుంది" అతను చెప్పాడు.

సత్య రూపం అతని కళ్ల ముందు కదిలింది.

అపరంజి బొమ్మ!

"సారీ! నాకు ఉద్దేశం లేదు... నేవస్తా!" లేచాడు.

"ఒకేసీయూ" అతను అభ్యంతరం చెప్పలేదు.

"ఇలాంటి వాళ్లతో మీరెందుకు స్నేహం చేస్తారు... మానెయ్యండి" ఆమె చిన్నగా అన్నా

ఆ మాటలు సారథి చెవిన పడ్డాయి - వరండా దిగి బయటకు వస్తూంటే.

రాత్రి ఎనిమిది అయి ఉంటుంది. ఏం చెయ్యాలో ఎక్కడికి పోవాలో అర్థం కావడం లేదు. సత్యను తను చంప లేదంటే ఎవరూ నమ్మరేం! సత్య చనిపోయిందన్న బాధకంటే ఈ నింద పడిందన్న బాధ ఎక్కువవుతున్నది.

ఉన్నట్లుండి ఎదురుగా ఇద్దరు స్త్రీలు ముందుకెళుతున్నారు. వాళ్ల వీపులు... జడలు... జడలో పూలు కనిపిస్తున్నాయి. అందులో ఎర్ర చీర కట్టుకున్న ఆమె వెనక నుంచి ఎక్కువ ఆకర్షణీయంగా ఉంది పక్కామెకంటే.

అదే! సత్య ఇలానే ఉండేది. ఇలానే చకచకా నడిచేది.

అచ్చం అదే నడక!

అచ్చం అదే రూపం!

అదే రంగు.

సారథి మనసు ఉరకలు వేసింది. ఒక్క పరుగులో వెళ్లి వాళ్లను చేరుకున్నాడు.

"ఆగు సత్యా!" అంటూ భుజంమీద చేయివేశాడు.

అంతే!

గిరుక్కున వెనక్కి తిరిగి ఆమె ఫెడీల్‌మని అతని చెంప పగులగొట్టింది. ఆమె ఫ్రెండు కూడా బిత్తరపోయింది సారథితోపాటు.

"రాస్కెల్! పిచ్చి పిచ్చి వేషాలెయ్యకు నా దగ్గర" చీకట్లో ఉన్న అతని చొక్కా పట్టుకుని గుంజి చెప్పింది.

సారథి ఈ లోకంలోకి వచ్చాడు.

ఆమె సత్య కాదు... కాని... కాని... సత్య చెల్లెలు వాసంతి.

"వాసంతి! నువ్వా! నన్ను గుర్తు పట్టలేదా!" చెంప మీద చేత్తో తడుముకుంటూ అడిగాడు.

వాసంతి ఓ క్షణం బిత్తరపోయి అతన్ని ఎగాదిగా చూసింది. భయంతో రెండు అడుగులు వెనక్కి వేసింది. గిరుక్కున తిరిగి వెళ్లబోయింది.

సారథి వాసంతి చెయ్యి పట్టుకున్నాడు ఆగమన్నట్టు.

"ఏయ్! మిస్టర్ చెయ్యి వదులు". కరుగ్గా అంది.

"వాసంతి! నేను సారథిని నీ బావను."

"మిస్టర్ నాకెవరూ బావల్లేరు. నా అక్క ఎప్పుడో చచ్చిపోయింది" చెయ్యి విడిపించుకుంటూ అంది.

"మీరన్నా చెప్పండి మిస్..." ఆమె వంక తిరిగి అన్నాడు.

"...మల్లిక! మీ పేరు సారథి. అంతేనా"? ఆమె అంది.

"అవును మల్లికగారు. ఈమె నా మరదలు వాసంతి."

"వాసంతి! నిజమేనా?" మల్లిక అడిగింది.

"నా పేరు వాసంతి నిజమేకాని, యితడెవరో నాకు తెలీదు."

"తెలీదూ...మీ అక్క సత్య బతికుంటే ఆ మాట అనేదానివా?" ఆవేశపడ్డాడు సారథి.

"ఉహు! ఆమెని పొట్టన పెట్టుకున్నావుగా... మల్లికా! పద పోదాం. ఇంకాసేపుంటే మనిద్దర్నీ కూడా హత్య చేస్తాడు" వాసంతి మల్లికను లాక్కుపోయింది.

సారథి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

మల్లిక తలతిప్పి చూస్తూ వెళ్లిపోయింది వాసంతితో.

సారధికి అంతా అయోమయంగా ఉంది. వాసంతి వాళ్ల ఊరు ఇది కాదు - చాలా దూరంలో ఉంది. ఆమె యిక్కడికెందుకొచ్చింది!

అప్పుడు లీలగా అతనికి ఆమె మెళ్లో మంగళ సూత్రాలు గుర్తుకొచ్చాయి.

పెళ్లి చేసుకునుంటుంది. భర్త యిక్కడ పని చేస్తున్నాడని సరిపెట్టుకున్నాడు.

"ఇంకాసేపుంటే మనిద్దర్ని కూడా హత్య చేస్తాడు". అన్నమాట గుండెల్లో బాకులా దిగబడింది.

మెడికల్ షాపు దగ్గర ఆగి స్లీపింగ్ పిల్సు కొనుక్కున్నాడు. మూడు స్లీపింగ్ పిల్స్ వేసుకుని పడుకున్నాడు ఆ రాత్రి.

భారంగా వారం రోజులు గడిచిపోయాయి.

ఆదివారం కదాని బద్ధకంగా కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటూ ఉంటే పల్లవి వచ్చింది పట్టుచీర కట్టుకుని స్వీట్లు తీసుకుని.

"సారథిగారూ! స్వీటు తీసుకోండి". పెట్టె తెరచి యిస్తూ చెప్పింది. "మీకు జాంగ్రీ కావాలా? బాదుషానా...లడ్డా?"

"నాకేదీ వద్దు". తిరస్కరించాడు.

"అదేంటి మీకు షుగరుందా!" ఆశ్చర్యంగా అడిగింది.

"నాకే జబ్బూ లేదు. నాకు స్వీటు యిష్టం లేదు". ముక్తసరిగా చెప్పాడు.

"కాని ఈ రోజు మీరు తీసుకోవలసిందే!" ఆజ్ఞాపించింది.

"ఏంటో ఈ రోజు ప్రత్యేకత!"

"నిన్న నాన్నగారు క్షేమంగా ఇంటికి వచ్చారు..."

"కాని నిన్ననే యివ్వాల్సింది."

"కాని ఈ రోజు నా పుట్టినరోజుగా!"

"ఐసీ! ఎన్నో వసంతం?"

"చెప్పకూడదంటారు. అయినా మీకు కాబట్టి చెబుతున్నా. ఆ చెవి యిలా యివ్వండి."

అతని మీదకు ఒంగి చెప్పింది చెవిలో.

"పద్దెనిమిదో ఏడు అని అమ్మ చెపుతుంటుంది... కాని... ఇరవై ఒకటి వచ్చింది నాకు" సిగ్గుపడుతూ చెప్పింది.

"మెనీ మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" పెట్టెలోంచి స్వీటు తీసుకుంటూ చెప్పాడు.

పల్లవి చాలా అందంగా ఉంటుంది. అమాయకత్వం కూడా ఆమె కళ్లల్లో కనిపిస్తూ ఉంటుంది.

"ఇంకొకటి కూడా తీసుకోండి."

"ఎందుకు...నాకు ఒకటి చాలు."

"మీకు కాదు...అక్కయ్యకి". అంటూ యింకో స్వీటు అతనికిచ్చింది. అతని సమాధానం కోసం చూడకుండా వెళ్లిపోయింది ఆమె.

అతని కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఆ స్వీటు తీసుకుని పెరట్లో ఉన్న గోడపైన పెట్టాడు. ఎక్కడినుంచో ఓ కాకి వచ్చి నోట కరుచుకుని వెళ్లిపోయింది.

కాసేపటికి అరవింద్ వచ్చాడు. అతను సారథికి ఫ్రెండ్! ఆఫీసు వేరే అయినా రోజూ దార్లో కలుసుకుంటూ ఉంటారు.

"సారథీ! నాకు సాయం చెయ్యాలి."
"ఏం అరవింద్?"
"సాయంత్రం ప్రోగ్రామ్స్ ఏమీ లేవుగా... ఉన్నా కాన్సిల్ చేసుకో... ఈ సాయంత్రం నాకోసం వెచ్చించాలి."
"సినిమాకా?"
"ఛ! అలా నీ టైం వేస్టు చేస్తానా? ఒంటి లింగం శొంఠి కొమ్ముగాడిని అని నీకు తెల్సుగా నమయానికి ఒక్క క్లోజ్ ఫ్రెండ్ కూడా ఊళ్లో లేడు... వాళ్లేమో తొందరపడుతున్నారు. అందుకని నువ్వు తోడుగా రా!"
"ఇంతకీ ఎక్కడికో చెప్పలేదు."
"జస్టు... పెళ్లి చూపులకి"
"నీకే!" బోల్డు ఆశ్చర్యపోయాడు.
సాయంత్రం అమ్మాయిని చూసి ఇంకా ఆశ్చర్యపోయాడు.
పున్నమి వెన్నెలలా అందంగా ఉంది ఆమె!
"మీ పేరు?" అరవింద్ ప్రశ్న.
"మల్లిక" తియ్యగా మృదువుగా చెప్పింది.
ప్రశ్నల వర్షం కురిపించాడు. ఆమె తడుముకోకుండా సమాధానాలు చెప్పింది. సారథికి చిత్రంగా ఉంది. పెళ్లిచూపుల్లో అన్ని రకాల ప్రశ్నలు అడుగవచ్చని అతనికి తెలియదు.
"బాబూ! అమ్మాయి నచ్చిందీ లేందీ తొందరగా తెలియజెయ్యండి. హార్టు పేషంటును. సస్పెన్సులు పెట్టవద్దు" వీడ్కోలిస్తూ మల్లిక తండ్రి చెప్పాడు.
సారథి సాభిప్రాయంగా అతని వంక చూశాడు. అతను కళ్లు ఎగరేశాడు.
అరవింద్ మరునాడు సారథి దగ్గరికి వచ్చి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఎంతోమందితో ఎన్నో సంబంధాలు చూశాడట! కాని ఇంతవరకు ఏదీ నచ్చలేదుట! ఎందుకో మల్లిక నచ్చిందట!
"మరింకేం...తెలియచెయ్యి!" అభినందిస్తూ అన్నాడు.
"మీడియేటర్‌కి చెబుతాను. అతనికోసమే పోతున్నాను" గాల్లో తేలిపోతూ వెళ్లిపోతూ చెప్పాడు.
కనీసం తనని అతను ఆ విధంగా ఉపయోగించుకోగలిగినందుకు సారథికి సంతోషంగా ఉంది.
మరునాడు...ముందుకు పోతున్న అరవింద్‌ను అందుకుని సారథి అడిగాడు కుతూహలంగా...
"ఏంగురూ! అంత నీరసంగా పోతున్నావ్! పెళ్లి కావాల్సినవాడివి...గుర్రంలా హుషారుగా ఉండాలి."
అరవింద్ శూన్యంలోకి చూస్తూ... ఓ వెకిలి నవ్వు నవ్వాడు. అతన్ని గమనించనట్టు ముందుకు పోబోయాడు.
"అరవింద్! ఎప్పుడు పెళ్లి! నన్ను మరిచిపోవుకదూ?"
"పెళ్లా! నా పిండాకూడా?" అతను సీరియస్‌గా అన్నాడు.
అదిరిపడ్డాడు సారథి. "అదేంటి? మధ్యవర్తి ద్వారా మల్లికకు నీ అంగీకారం తెలుపలేదా?"

"నేనొప్పుకుంటేనే పెళ్లి అయిపోతుందా?"

"నీకేం తక్కువ? అన్నీ ఉన్నవాడివి! ఏం ఆమెకిష్టం లేదా? నీలాంటి వరుడు ఎక్కడ దొరుకుతాడు? ఆమెతో నేమాట్లాడనా?"

"అక్కరలేదు_నీతో పోవడమే నా కొంప ముంచింది. నీ ఫ్రెండు కావడమే నేచేసుకున్న పాపం!" తలవిదిలించి అరవింద్ కాళ్లీడ్చుకుంటూ వెళ్లిపోయాడు.

భూమిలోకి పాతుకుపోయినట్లు నిశ్చలంగా నిల్చుండిపోయాడు సారథి!

భారంగా కదిలిపోతున్న అరవింద్‌ను చూస్తూ ఉండిపోయాడు. మసక మసగ్గా అలికేసినట్లు కనిపిస్తున్నాడు.

ధారగా కారుతున్న కన్నీటిని తుడుచుకోవాలన్న ధ్యాస లేకుండా అటే చూస్తున్నాడు సారథి!

'జీవితంలో ఓడిపోయి పూర్తిగా ఒంటరివాడనైపోయాన'ని బాధపడుతూ తలవంచుకుని గిరుక్కున వెనక్కి తిరిగి ముందుకు నడిచాడు సారథి.

(ఆదివారం ఉదయం - సెప్టెంబరు 27-9-1992)

